అట్టహాసంగా ప్రారంభమైన నిమజ్జన పర్వం

- మూడు రోజులపాటు పూజలందుకున్న గణనాథులు
- ఊరేగింపుగా గంగఒడికి చేర్చిన నిర్వాహకులు
- చివరిరోజు పెద్ద ఎత్తున సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు
- బందోబస్తు కల్పించిన పోలీసులు


రాయచోటి టౌన్: మదనపల్లె రోడ్డులో పూజలు అందుకుంటున్న 24 అడుగుల వినాయకుడి ప్రతిమ


నందలూరు: లడ్డూ వేలంపాటలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు


రాజంపేట టౌన్: గణనాథుడి ఊరేగింపులో కేరింతలు వేస్తున్న యువతులు

సంబేపల్లె : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో కొలువైన గణనాథులు సోమవారం గంగ ఒడిలోకి చేరారు. ఉదయం నుంచే మండలంలోని అన్ని గ్రామాలలోని ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథులను పురవీధులలో యువత కేరింతలు, డీజే శబ్దాలు, బాణసంచాల నడుమ వైభవంగా నిమజ్జన వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలు వాగులలోకి గణనాథుల విగ్రహాలను వదిలారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాజంపేట టౌన్ : వినాయక చవితి రోజు నుంచి రెండు రోజులపాటు విశేష పూజలందుకున్న గణపయ్య గంగఒడికి పయనమవుతున్నాడు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో మూడవ రోజైన సోమవారం గణనాథుల నిమజ్జన వేడుక కోలాహలంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీలు వినాయక స్వామి విగ్రహాలను కోలాహలంగా ఊరేగించారు. జై బోలో గణేష్ మహరాజ్ నినాదాలు అన్ని ప్రాంతాల్లో వినిపించాయి. కాగా పట్టణంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో చవితి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లి పంచాయతీలోని ఎన్టీఆర్ నగర్‌లో చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉట్టి కార్యక్రమంలో మాకం సాయి తన్వీస్ విజేతగా నిలిచాడు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో చిన్నారి బొమ్మనపోయిన చరణ్ రూ. 7 వేలకు లడ్డును దక్కించుకున్నారు. అలానే ఆర్ఎస్ రోడ్డులో వరసిద్ది వినాయక ఉత్సవ కమిటీ టీమ్ పదవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద సోమవారం మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నీలిపల్లి రోడ్డులోని గణేష్ నగర్ వద్ద జంగంశెట్టి ఈశ్వరయ్య, జంగంశెట్టి లోకేష్‌ల ఆధ్వర్యంలో, నీలిపల్లి గ్రామంలో వినాయకస్వామి ఆలయం వద్ద దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రామాపురం : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం వినాయక నిమజ్జనాలను ఆయా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించారు. వినాయక చవితి శనివారం రావడంతో పలు గ్రామాలలోని ప్రజలు ఉదయం నుండే సాయంత్రం వరకు భక్తిభావంతో పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు. కొత్తపల్లిలో ఈ సారి లడ్డూ వేలం పాటలో బండారు శ్రావణ్‌కుమార్ రూ.31వేలు, వినాయక ప్రతిమలోని బొడ్డులో రూ.5 బిళ్లను మాదినేని లోకేష్ రూ.12వేలుకు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో నారాయణ చంద్రమౌళి, ఆంజనేయులు, రాజశేఖర్, తిమ్మారెడ్డి, రవి, లక్ష్మినారాయణ, బాబ్జి, రమేష్, రమణ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : పట్టణంలో కొలువుదీరిన వినాయక విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు పూజలు చేస్తున్నారు. సోమవారం మూడో రోజు సందర్భంగా పలు వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. రాయచోటి పట్టణ, రూరల్ పరిధిలో మొత్తం 219 వినాయకుడి ప్రతిమలను ప్రతిష్టించగా సోమవారం 15 ప్రతిమలను నిమజ్జనం చేశారు. పట్టణంలోని మదనపల్లె రోడ్డు ఎంజీఆర్ గ్రాండ్ హోటల్ వెనుక 24 అడుగుల భారీ గణనాథుని ప్రతిమను ప్రతిష్టించారు.

చిట్వేలి : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మూడోరోజు సోమవారం నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా మండలంలో 140 ప్రాంతాలలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. సోమవారం 90 విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాలలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. మండలంలోని ఎల్లమరాజు చెరువు, రాజుకుంట, నాగవరం చెరువుల్లో నిమజ్జనానికి విగ్రహాలు తరలి వచ్చాయి. ఎస్ఐ రఘురాం, సిబ్బంది పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా నిమజ్జనోత్సవాలను జరిపించారు.

రాజంపేట రూరల్ : మండల పరిధిలో నిర్వహిస్తున్న గణేష్ మహోత్సవాలు సోమవారం మూడోరోజుకి చేరుకున్నాయి. కొన్ని గ్రామాలలో వేడుకగా నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా లడ్డూ వేలంపాటలు ఆసక్తిగా సాగాయి. కాగా కట్టకిందపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామిని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

సిద్దవటం : మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి విగ్రహాలకు సోమవారం వైభవంగా నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసిన మూడవ రోజు భక్తి శ్రద్ధలతో పూజలు జరిపి చివరి రోజు విగ్రహాలకు పూలతో అలంకరించి ట్రాక్టర్లలో ఎక్కించి గ్రామంలో ఊరేగించి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. కడప, ఒంటిమిట్ట, అట్లూరు ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలను పెన్నానదిలో నిమజ్జనానికి పెద్దసంఖ్యలో వచ్చాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా విగ్రహాలను క్రేన్ సహాయంతో ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్ఐ చింరంజీవి, తహసీల్దారు మురాషావలి, పోలీసులు నిమజ్జన ప్రక్రియ జరిపించారు.

పెనగలూరు : కార్యసిద్ది వినాయక స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజలలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలను పంచిపెట్టారు.

పుల్లంపేట : వినాయక చవితిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా మండల పరిధిలోని ఆర్.గొల్లపల్లి, చాపలహరిజనవాడ, అప్పారాజుపేట తదితర గ్రామాలలో వినాయక స్వామి గ్రామోత్సవం కనుల పండుగగా జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ బాణసంచా పేల్చుతూ గ్రామంలో వినాయకుని ఊరేగించి మంగంపేట వద్ద నిమజ్జనానికి తీసుకెళ్లారు.

లక్కిరెడ్డిపల్లె : వినాయక విగ్రహాలు మూడవ రోజు సోమవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఉదయం నుండే గ్రామాలలో వినాయక ప్రతిమల వద్ద లడ్డూ వేలం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో చెక్క భజన, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని దొర్రిచెరువు వద్ద వినాయక ప్రతిమలను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ రవీంద్రబాబు తన సిబ్బందితో పటిష్ట భద్రతను కల్పించారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలోని వినాయక ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని బలిజపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద 20 మంది భక్తులు వినాయక స్వామి దీక్షలు బూనారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళల్లో గణపతికి ప్రత్యేక పూజాది క్రతువులను వారు నిర్వహించారు. వినాయక స్వామి మాలధారణను 15 రోజుల పాటు నిర్వహించి నిమజ్జనం రోజున దీక్ష విరమించనున్నట్లు వారు తెలిపారు.

ఓబులవారిపల్లె : మండల వ్యాప్తంగా విఘ్నేశ్వరుడికి ప్రజలు సోమవారం పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వీడ్కోలు పలికారు. గ్రామాల్లో వినాయకుడికి వాహనాలపై కొలువుదీర్చి వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. నిమజ్జనానికి ఎస్ఐ పి.మహేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


చిన్నమండెం: బలిజపల్లె వినాయక ప్రతిమ వద్ద దీక్ష బూనిన భక్తులు


చిట్వేలి: నిమజ్జనానికి వెళ్తున్న కొత్తబస్టాండ్ గణేశుడు


పుల్లంపేట: చాపల హరిజనవాడలో..


రాజంపేట రూరల్: వినాయకస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


లక్కిరెడ్డిపల్లె: మూడు రోడ్ల కూడలిలో పూజలు అందుకుంటున్న లంబోదరుడు, పాల్గొన్న భక్తులు


ఓబులవారిపల్లె: వసంతాలు చల్లుకొని ఊరేగింపులో పాల్గొన్న యువకులు


సంబేపల్లె: దుద్యాల జంగంపల్లెపాతపల్లెలో..


రామాపురం: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

పబ్లిసిటీపై ఉన్న శ్రద్ధ.. వరద బాధితులపై లేదు

- ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విజయవాడ వరద
- వరద బాధితులను ఆదుకోవడంలోనూ సర్కార్ విఫలం
- చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు సామాన్యులు బలి
- మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



రైల్వేకోడూరు అర్బన్ : కృష్ణానది వరదలతో విజయవాడ ప్రజలు పడిన ఇబ్బందులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యమే కారణమని సోమవారం రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక ఆయన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో వరదలు వచ్చే అవకాశాలను వాతావరణ శాఖ ముందుగా ప్రభుత్వానికి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం అలసత్వం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికలపై సమీక్షలు చేసి అధికారులను అప్రమత్తం చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉన్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించి విజయవాడ శివారు ప్రాంత ప్రజలను నీట ముంచారన్నారు. ఈ ఉపద్రవానికి కారణం కేవలం సీఎం చంద్రబాబు నాయుడు, ఎన్డీయే కూటమి ప్రభుత్వ ముందుచూపు లేని తనమేనని చెప్పారు. స్వార్థ రాజకీయాలు తప్ప పేద ప్రజలు వారి రక్షణ పట్ల ఆలోచించే మనస్తత్వం చంద్రబాబుది కాదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి సుమారు 50 మంది ప్రజలు ప్రాణాలను పోగొట్టుకున్నారంటేనే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మూడు రోజులైన వెళ్లలేని పరిస్థితి ఉందంటే ఆ ప్రాంత ప్రజలు ఎంత దారుణమైన పరిస్థితి ఎదుర్కొన్నారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు తగ్గుతున్నప్పటికీ వరద సాయాన్ని పూర్తి స్థాయిలో అందించలేకపోయామని సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఆకలితో అలమటిస్తున్న, చిన్న పిల్లలు పాల కోసం పడుతున్న నరకయాతనలు ఈ ప్రభుత్వానికి కనబడకపోవటం మన దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబుకు పబ్లిసిటీపైన ఉన్న శ్రద్ధ పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం చూపించివుంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదన్నారు. తనను విజనరీ అని చెప్పుకునే చంద్రబాబు, వరద ప్రభావిత ప్రజలను అప్రమత్తం చేయడంలో.. ఆదుకోవడంలో ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. కరకట్ట మీద ఉన్న ముఖ్యమంత్రి నివాసాన్ని, వేమూరి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ ప్లాంట్‌లు నీట మునగకుండా ఉండేందుకు సామాన్య ప్రజలను బలితీసుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటికైనా వరద ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు నిత్యావసర సరకులతో పాటు వారి ఎదురైన నష్టపరిహారాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించాలంటూ డిమాండ్ చేశారు.

12 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

ఓబులవారిపల్లె : ఈనెల 12వ తేదీ నుంచి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తామని, 14 ,17వ తేదీలలో కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వై.కోట ప్రధానోపాధ్యాయులు సయ్యద్ ఇక్బాల్ బాషా అధ్యక్షతన మండల కో–ఆర్డినేటర్, ఫిజికల్ డైరెక్టర్ సుబ్రమణ్యంల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు.

చిట్వేలి : మండలస్థాయి స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలు మండల స్థాయిలో ఈనెల 12, 13వ తేదీలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ పోటీలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆతిథ్యం ఇస్తున్నట్లు ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్య, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తంరెడ్డిలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అండర్–14, అండర్–17 విభాగాలలో బాలురు, బాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, చెస్ తదితర ఏడు అంశాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని పాఠశాలల పీడీలు, పీఈటీలు అర్హత గల క్రీడాకారుల జాబితా, మధ్యాహ్న భోజన అటెండెన్సు ఫామ్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

పెనగలూరు : ఈనెల 12న పెనగలూరు మండలస్థాయి క్రీడా పోటీలను పెనగలూరు హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రణవిలు తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఖోఖో, వాలీబాల్, షటిల్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ తదితర పోటీలను నిర్వహిస్తామని వారు తెలిపారు.

పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధ్యమే

వీరబల్లి : విద్యార్థులలో పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించవచ్చని మండల వైఎస్సార్‌సీపీ ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీలో కల్లెవారిపల్లికి చెందిన నాగరాజు అనే విద్యార్థి ఇటీవల నేపాల్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కేజీల విభాగంలో పాల్గొని 390 కేజీలు బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. ఆయన ప్రతిభ గుర్తించి వీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గోల్డ్ మెడల్ సాధించిన నాగరాజును శాలువతో సన్మానించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులలో పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించవచ్చని, ఇందుకు నిదర్శన మన నాగరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అజంతుల్లా, సర్పంచ్ రవి, కుళ్లాయి రెడ్డి, అధ్యాపకులు భాస్కర్, రామచంద్ర, తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన నాగరాజును సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

అన్నదానం

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో మహిళలకు సోమవారం మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెల పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చే గర్భిణులు, బాలింతలకు ఎంపీపీ అన్నదానం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలం కేటాయించండి

గాలివీడు : మండల కేంద్రంలోని స్థానిక పెద్దూరు బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భాగ్యలతను కలసిన కమిటీ సభ్యులు దేవాలయంలో మౌలిక వసతుల కల్పనకై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో మరుగుదొడ్లు లేక భక్తులు, మహిళలు, చిన్న పిల్లల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాక అర్చకులు ఉండటానికి, వివాహాలు చేసుకునే సమయంలో వధూవరులు ఉండటానికి సరైన గదులు లేక ఇబ్బంది పడుతున్నందున తగిన స్థలం కేటాయిస్తే నిర్మాణం చేపడతామని తెలియజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ స్థల కేటాయింపును పరిశీలించాలని వీఆర్‌ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రిషికేశ్, హరిక్రిష్ణ, వీరారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయండి

రాయచోటి అర్బన్ : గుర్రంకొండకు చెందిన దళితుడైన బుడ్డపల్లె కదిరయ్య కుటుంబీకులను బెదిరించిన ఉన్నత కులాలకు చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బనాయించి కఠినంగా శిక్షించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు రాయచోటి ఆర్‌డీఓ రంగస్వామి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను కలుసుకుని ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కదిరయ్యకు చెందిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన రహంతుల్లా ఆక్రమించుకోవడమే కాక బెదిరింపులకు దిగాడన్నారు. అలానే దాడికి పాల్పడినట్లు చెప్పారు. నిందితుడు, కుటుంబీకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత కుటుంబీకులు రెడ్డెయ్య, పాపులమ్మ, డిహెచ్‌పియస్ నేతలు పెద్ద గంగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు

రాజంపేట టౌన్ : స్థానిక కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు అండర్–17 బాలికల జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవాస్తవ సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.సెరినా, నాగలక్ష్మీ, హర్షిత, ఎం.అక్షయ, యూ.కుంకుమసౌభాగ్యవతి, ఎస్.యశ్వని, ఈ.ప్రషిత, ఆర్.మోహన వైష్ణవి, ఎ.అనీల్, సీ.బాలభారతి, సీ.మనోజ్ఞ, కె.తేజశ్వి, ఎం.వేదశ్రీ, ఆర్.వాణిశ్రీ, సీ.సౌమ్యశ్రీలు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈనెల 23వ తేదీ నుంచి ఐదు రోజులపాటు రాజస్థాన్‌లో పోటీలలో వారు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులు ఎంపిక పట్ల పీఈటీ రాహుల్‌కుమార్‌ను ఆయన అభినందించారు.

విజయవంతంగా ఆర్టీసీ డ్రైవింగ్‌స్కూల్

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవింగ్ స్కూల్ విజయవంతంగా కొనసాగుతోందని రాజంపేట డిపో మేనేజరు రమణయ్య అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నాయన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నవారు ఆర్టీసీలోనూ, ప్రైవేటు ట్రావెల్స్‌లో బస్సుల్లో డ్రైవర్‌గా అర్హత కలిగి ఉపాధి పొందుతున్నారన్నారు. 16 బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడానికి సన్నహాలు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

39.6 టన్నుల యూరియా మంజూరు

సిద్దవటం : మండలానికి 39.6 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాధవరం–2 రైతు సేవా కేంద్రానికి 9.8మెట్రిక్ టన్నులు, పెద్దపల్లెకు 9.8మెట్రిక్ టన్నులు, సిద్దవటానికి 19.8 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని చెప్పారు. 45 కిలోలు యూరియా బస్తా విలువ రూ. 267.50 పైసలు అవుతుందని ఆయన తెలియజేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


సిద్దునాయక్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తేనే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని మండల విద్యాశాఖాధికారులు వెంకటేష్ నాయక్, రవీంద్రనాయక్‌లు తెలిపారు. సోమవారం మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మూడే సిద్దు నాయక్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఇంట్లో చొరబడి.. మద్యం సేవించి, చోరీ


బీరువాను పగులకొట్టి బంగారు, నగదు దొంగలించిన దృశ్యం


మద్యం సేవించి బాటిళ్లను వదిలివెళ్లిన దొంగలు

వీరబల్లి : మండలంలో సోమవారం పంచాయతీలో వడ్డిపల్లికి చెందిన మేముల వెంకటమ్మ ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెంకటమ్మ గత వారం రోజుల నుంచి బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాల్లో కూలీకి వెళ్లింది. ఇది గమనించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంట్లోకి చొరబడి మద్యం సేవించి చోరీకి పాల్పడ్డారు. బీరువాను పగులకొట్టి రూ. 25 వేలు నగదు, 5 తులాలు బంగారును దొంగలించినట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి చుట్టుపక్కల వారిని విచారించారు. క్లూస్ టీం సాయంతో సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలింపజేసి, వేలిముద్రలు సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా విఘ్నేశ్వరుడి కల్యాణం


కల్యాణ వేడుకలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

పెనగలూరు : మండలంలోని పెనగలూరు పంచాయతీ ఇండ్లూరు గ్రామంలో సోమవారం రాత్రి సిద్ధి, బుద్ధిల సమేత విఘ్నేశ్వరుడి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దండు గంగమ్మగారి లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట మహేంద్రరెడ్డి, గౌతమ్ రెడ్డి దంపతులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామిని అత్యంత సుందరంగా అలంకరించి వేదికపై ఆశీనులు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ క్రతువును జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలు వారు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు అల్పాహార విందు, ప్రసాదం అందించారు.


వేద మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ క్రతువును జరిపిస్తున్న వేదపండితులు

30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలి

సంబేపల్లె : కొత్త పీఆర్సీ అమలులోకి వచ్చేంత వరకు ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంబేపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్త పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉంచిన బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ కౌన్సిలర్లు మురళీకుమార్, వెంకటేశ్వర రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శులు రాజారెడ్డి, దామోదర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

రాయచోటి టౌన్ : తుపాను బీభత్సానికి అతలాకుతలం అయిన విజయవాడ ప్రజలకు చేయూతనిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ రాయచోటి ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, వ్యాపారులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు నడుంబిగించారు. ఈ క్రమంలో సోమవారం విద్యాసంస్థల జేఏసీ చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు, పలు విద్యాసంస్థల యజమానులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

25న చెకుముకి పోటీలు

రాజంపేట రూరల్ : జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఈ నెల 25న పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు వై.నందకిషోర్‌గౌడ్, ఎస్ రౌఫ్‌బాషా, ఎన్.రాజయ్యలు తెలియజేశారు. స్థానిక ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో సోమవారం చెకుముకి పోటీల గోడపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు మాట్లాడుతూ రాజంపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు కేవీఎస్ కిషోర్, పి.వెంకటేశ్వర్లు, ఎం.హరికృష్ణ, ఉపాధ్యాయులు రియాజ్, ఉమ, ప్రియ, శిరీషాలు పాల్గొన్నారు.